క్లుప్తంగా

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ సంఘం ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

పాల్వంచ: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (1104) జెన్‌కో అధ్యక్షుడిగా కె.కోటేశ్వరరావు (కేటీపీఎస్ 5,6దశలు), ప్రధాన కార్యదర్శిగా వి.దుర్గా అశోక్ (సింగూర్), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.యాసయ్య (నాగార్జునసాగర్), అడిషనల్ సెక్రటరీగా కుశలవరెడ్డి(వైటీపీఎస్)లు నియామకమయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వేమునూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జి.సాయిబాబు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. వీరి ఎంపిక పట్ల పలువురు కేటీపీఎస్ కార్మిక సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరు

ఇల్లెందురూరల్: మండలంలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయి. కొమరారం, చల్లసముద్రం కేంద్రంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు పీఏసీఎస్ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ధాన్యం సన్నరకాలకు మద్దతు ధరగా క్వింటా ఒక్కింటికి రూ.2320, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా బోనస్ రూ.500 చొప్పున, దొడ్డు ఒడ్లు క్వింటా ఒక్కింటికి మద్దతు ధర రూ.2300 రైతుకు చెల్లించనున్నారు. కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభిస్తామని పీఏసీఎస్ ఇన్‌చార్జ్ సీఈఓ హీరాలాల్ బుధవారం తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభకు తరలిరండి..

ఇల్లెందు: కొత్తగూడెంలో బుధవారం జరగనున్న ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభను విజయవంతం చేయాలని టీఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మేకల శ్యామ్ కోరారు. మంగళవారం ఇల్లెందులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పుతో ఎస్సీ రిజర్వేషన్ ప్రక్రియ ఊపందుకుందని తెలిపారు. ఈ విజయోత్సవ సభకు సంఘం నాయకులు ఇటుక రాజు హాజరవుతారని తెలిపారు. దుర్గారావు, చంద్రశేఖర్, శివ, ప్రకాష్, శేషు, శశి, సాగర్ పాల్గొన్నారు.

ప్రజాసేవలో నిమగ్నం కావాలి



కానిస్టేబుళ్లతో ఎస్‌ఐ సురేష్

పాల్వంచరూరల్: అంకుఠిత దీక్షతో ప్రతీ పోలీసు ప్రజాసేవలో నిమగ్నం కావాలని రూరల్ ఎస్‌ఐ బి.సురేష్ అన్నారు. మండల పరిధి కిన్నెరసానిలో రూరల్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం గ్రామీణ ప్రాంతాల పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహించి పదిహేను సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నలుగురు కానిస్టేబుల్స్ కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. 2009 బ్యాచ్‌కు చెందిన ప్రస్తుతం రూరల్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న తేజావత్ నాగేశ్వరరావు, దుబ్బ ప్రసాదరావు, విజయ్‌కుమార్, మోహన్‌బాబు వివిధ ప్రాంతాల్లోని గ్రామీణ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ 15 ఏళ్లు పూర్తిచేసుకోవడం అభినందనీయం అన్నారు. విధినిర్వహణలో ప్రతీపోలీసు ప్రజల మన్ననలు పొందాలన్నారు. చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

మూలనపడిన అంబులెన్స్



నిరుపయోగంగా మారిన అంబులెన్స్

పాల్వంచ: కేటీపీఎస్ 7వ దశ కర్మాగారానికి చెందిన అంబులెన్స్ మూలనపడింది. సుమారు సంవత్సర కాలంగా మరమ్మతులకు గురై వినియోగంలో లేకుండా పోయింది. దీంతో అధికారులు వాహనాన్ని ఎంసీఆర్ హాల్ సమీపంలో మూలన పెట్టేవారు. దీంతో కర్మాగారంలో అనుకోకుండా ఉద్యోగులు, కార్మికులు ప్రమాదం జరిగినా, అనారోగ్యానికి గురైన వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండువేల మంది పనిచేస్తున్న ఈ కర్మాగారంలోని అంబులెన్స్ పనిచేయక పోవడంతో వాహనంలో పనిచేసే నలుగురు డ్రైవర్లను ఇతర పనుల్లోకి తీసుకున్నారు. సీఈ పి.వెంకటేశ్వరరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

ఆంగ్లంపై పట్టు సాధించేలా..

- 'సాక్షి' స్పెల్ బీతో విద్యార్థులకు ఉపయోగం
- ఉత్సాహంగా పరీక్ష రాసిన 'త్రివేణి' విద్యార్థులు



పరీక్షను పర్యవేక్షిస్తున్న త్రివేణి ప్రిన్సిపాల్ సురేష్, ఉపాధ్యాయులు

కొత్తగూడెంరూరల్: విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించేందుకు 'సాక్షి'స్పెల్ బీ పరీక్ష ఉపయోగపడుతుందని లక్ష్మీదేవిపల్లి మండలంలోని త్రివేణి ఐఐటీ పాఠశాల ప్రిన్సిపాల్ వై.వీ.సురేష్ తెలిపారు. పాఠశాలలో స్పెల్ బీ పరీక్ష మంగళవారం నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆంగ్లంపై భయంతో వెనకబడుతుంటారని, ఈ మేరకు భయం పోగొట్టి ఇంగ్లిష్‌లో ముందు నిలిచేలా సాక్షి ఆధ్వర్యాన కొన్నేళ్లుగా పరీక్ష నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. పరీక్షకు హాజరుకావడంతో భాషపై పట్టుతో జ్ఞాపకశక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పాటుపడుతున్న 'సాక్షి' విద్యార్థుల కోసం పరీక్షలు నిర్వహిస్తుండడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు సింధూర, ఇన్‌చార్జ్ ఎం.చంద్రయ్య, సాక్షి సిబ్బంది తాటిపల్లి రాజేష్‌కుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మెళకువలు నేర్చుకోవచ్చు..



ఇంగ్లిష్‌లో మెళకువలు నేర్చుకోవడానికి ఈ పరీక్ష ఉపయోగపడుతుంది. సాక్షి ఆధ్వర్యాన స్పెల్ బీ, మాథ్స్ బీ పరీక్షలు నిర్వహిస్తుండడం సంతోషంగా ఉంది.

– సేహ్రిత జాదవ్, 9వ తరగతి

సంతోషంగా ఉంది..



ఇంగ్లిష్ అంటే భయమే. 'సాక్షి 'ఆధ్వర్యాన నిర్వహించిన ఈ పరీక్షకు హాజరుకావడం సంతోషంగా ఉంది. సబ్జెక్టుపై పట్టు పెరుగుతుంది.

– సైన్యశ్రీ, 8వ తరగతి

పోటీ పరీక్షలకు ఉపయోగం..



భవిష్యత్‌లో పోటీ పరీక్షలు రాయడానికి సాక్షి స్పెల్ బీ పరీక్ష ఉపయోగపడుతుంది. అంతేకాక జ్ఞాపకశక్తి పెరుగుతుంది. 'సాక్షి' యాజమాన్యానికి కృతజ్ఞతలు.

– ఎస్.హర్షిత్, 7వ తరగతి

ప్రతిభను వెలికి తీయొచ్చు..



పదేళ్లుగా 'సాక్షి' స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయం. విద్యార్థులు తమ ప్రతిభను వెలికి తీయొచ్చు.

– వై.వీ.సురేష్, ప్రిన్సిపాల్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణలు కోరారు. మంగళవారం ఇల్లెందు పట్టణం స్టేషన్ బస్తీ బోరింగ్ తండాలో నాకా బందీ నిర్వహించారు. తెల్లారుజామునే 60 మంది పోలీసులు ఇంటింటిని సెర్చ్ చేసి వాహనాలు, వాటి పత్రాలు, లైసెన్సు, బీమా పత్రాలను పరిశీలించారు. పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. బస్తీలోకి వచ్చే కొత్త వ్యక్తుల సమాచారం అందించాలని కోరారు. మత్తు, మాదక ద్రవ్యాలను వినియోగించరాదన్నారు. ఎవరైనా సరఫరా చేస్తే వారి సమాచారం ఇవ్వాలని సూచించారు. కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయని, పత్రాలు లేని వాహనాలు నడపరాదని, ఎవరైనా నడిపితే ప్రమాదాలకు గురైతే వారిపై శిక్షలు కఠినంగా ఉంటాయని తెలిపారు. అపరిచితులు పంపే ఫేస్‌బుక్, ట్విట్టర్ మెస్సేజ్‌లు, మెయిల్స్‌కు ఆన్సర్ ఇవ్వొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు నాగుల్ మీరా ఖాన్, సూర్యలతో పాటు ఏఎస్‌ఐ, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

పుట్టినబిడ్డ సంరక్షణపై అవగాహన



పాల్వంచరూరల్: ఆశాలకు రికార్డులు అందజేస్తున్న డాక్టర్ రాజు

పాల్వంచరూరల్: అప్పుడే పుట్టిన బిడ్డను సంరక్షించుకోవాల్సిన అవశ్యకతపై డాక్టర్ రాజు వివరించారు. మండలంలోని జగన్నాథపురం పీహెచ్‌సీలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశాలకు నూతన రికార్డులను అందజేశారు. మాట్లాడుతూ... పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలను తాగించడం శ్రేయస్కరం అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్లు మెహర్ క్రాంతి, డాక్టర్ కృష్ణప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ రాజ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ కృష్ణయ్య, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

సుజాతనగర్: నవజాత శిశువులకు సకాలంలో టీకాలు వేసేలా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి బాలాజీ నాయక్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆశా డే కార్యక్రమంలో నవజాత శిశువుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నవజాత శిశువు రోగాల బారిన పడకుండా ఉండాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి అని తెలిపారు. బిడ్డ పుట్టిన తరువాత 24 గంటల్లో వేయాల్సిన మూడు టీకాలను తప్పనిసరిగా వేయించాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ బిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని నిబంధనల ప్రకారం టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రమేష్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలను సాధిద్దాం..



మాట్లాడుతున్న రాంబాబు

పాల్వంచరూరల్: బంగ్రుగొండ గ్రామంలో సీపీఐ(ఎంఎల్) (ప్రజాపంథా) మాస్‌లైన్ ఆధ్వర్యంలో మంగళవారం అమరవీరుల వారోత్సవాల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు మాట్లాడుతూ... భూమి, భుక్తి, దేశ విముక్తి కోసం వీరులు తమ ప్రాణాలను అర్పించారని అమరుల ఆశయ సాధన కోసం ఉద్యమించాలన్నారు. ప్రభుత్వాలు, పాలకులు ఎంతమంది మారినా పేదల బతుకులు మాత్రం మారడం లేదని వాపోయారు. ధనికులు ఇంకా మరింత ధనికులుగా ఎదుగుతున్నారన్నారు. దేశంలో 50 కోట్ల మంది అర్ధాకలితో అలమటిస్తున్నారని అందుకు దోపిడీ, పాలక వర్గాల ప్రజా వ్యతిరేక విధానాలే కారణం అన్నారు. అమరుల ఆశాయాల సాధనకు నేటి యువత విప్లవ రాజకీయాల్లోకి వచ్చి సమసమాజ స్థాపనకు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో కంటే గోవర్ధన్, వెంపటి జనార్దన్, ప్రభాకర్, బాబు, వెంకటప్పయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు సహకరించండి..



మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల

పాల్వంచ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. ఈనెల 6వ తేదీ సమగ్ర కుటుంబ సర్వే చేపట్టనుందని, కుటుంబ సభ్యుల వివరాలను అధికారులు సేకరిస్తారన్నారు. సర్వే అనంతరం కార్డులు పంపిణీ చేస్తారని, కార్డు వల్ల ప్రభుత్వం ఇచ్చే పథకాల పంపిణీ ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, కనగాల నారాయణరావు, ఎస్‌వీఆర్ కె.ఆచార్యులు, చింతా నాగరాజు, వెంకటాచారి, వై.వెంకటేశ్వర్లు, దారా చిరంజీవి, చాంద్‌పాషా, మహేష్, శాంతివర్ధన్, సుందర్‌రావు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: నేటి నుంచి ఇంటింటా జరగనున్న కుల గణన సర్వేకు 243 మంది ఎన్యూమరేటర్లు పాల్గొనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ డీటీ విజయ్‌చందర్ మంగళవారం తెలిపారు. బుధవారం నుంచి ఈనెలఖారు వరకు నిర్వహించనున్న సర్వేలో మండల పరిధిలో 65మంది, 178 మంది మున్సిపాలిటీ పరిధిలో పాల్గొంటారని వివరించారు. మూడురోజులపాటు గృహలను గుర్తించడం జరుగుతుందని వివరించారు.

జూలూరుపాడు: బుధవారం నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం కానున్నట్లు జూలూరుపాడు తహసీల్దార్ కె.స్వాతిబిందు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్‌లో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతం చేయాలని, ప్రజలంతా తమ ఇంటి ముందుకు వచ్చే ఎన్యుమారేటర్లకు వివరాలు అందజేసి సహకరించాలని కోరారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ సర్వేలో సమాచార సేకరణ కోసం 73 మంది ఎన్యూమరేటర్లు వినియోగిస్తున్నామన్నారు.

పెన్షన్‌దారులకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని హెడ్ పోస్టాఫీసులో పెన్షన్‌దారులకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు జారీ చేసేందుకు తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కొత్తగూడెం హెడ్ పోస్ట్ మాస్టర్ ఆర్.సంతోష్‌కుమార్ తెలిపారు. మంగళవారం పోస్టాఫీసులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఏడాది పెన్షన్‌దారులు ప్రభుత్వానికి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుందని, రూ.70 నామమాత్రపు ఫీజుతో పోస్టాఫీసుల్లో సర్టిఫికెట్లు పొందే అవకాశముందన్నారు. సర్టిఫికెట్ల జారీకి ప్రత్యేక క్యాంపులను కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 8న కొత్తగూడెం హెడ్ పోస్టాఫీస్‌లో క్యాంపు ఉంటుందని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పెన్షన్‌దారులు ఈపీ–95 పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమరవీరుల త్యాగం వృథా కాదు..

ఇల్లెందు: పీడీఎస్‌యూ చంద్రన్న వర్గం ఆధ్వర్యంలో చీకటి గండ్ల అడవుల్లో అమరవీరులు జంపాల చంద్రశేఖర ప్రసాద్, నీలం రామచంద్రయ్య అమరత్వం పొందిన స్థలంలో మంగళవారం నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.సాంబ మాట్లాడుతూ.. విద్యార్థి అమరవీరుల త్యాగం వృథా కాదు అన్నారు. శాస్త్రీయ విద్యావిధానం లక్ష్యంగా ఏర్పడిన పీడీఎస్‌యూ సంఘం అదే లక్ష్యం కోసం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్, వివేక్, అరుణ్, సాయి, పవన్, సాగర్, ఉదయ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి..

టేకులపల్లి: ఉద్యమంలో అనేక మంది కార్యకర్తలు, నాయకులు అమరులయ్యారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు భూక్యా హర్ష్య, ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు డి.ప్రసాద్ అన్నారు.

ఈ మేరకు మంగళవారం పెట్రాంచెలక, తుమ్మలచెలక, బేతంపూడి గ్రామాల్లో అమరవీరుల వర్ధంతి సభలు నిర్వహించారు. అనంతరం ఈనెల 8న కాచనపల్లిలో జరగనున్న అమరవీరుల వర్ధంతి బహిరంగ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించి ప్రచారం నిర్వహించారు. బహిరంగ సభకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సిద్ధం

- ఎన్యూమరేటర్లకు సామగ్రి పంపిణీ, ప్రాంతాల కేటాయింపు
- నేటి నుంచి ప్రక్రియ ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ప్రక్రియ సజావుగా సమగ్రంగా సాగేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సర్వే కోసం ఎన్యూమరేటర్లను ఎంపిక చేసి సర్వే చేయాల్సిన ప్రాంతాల సమాచారం, సామగ్రిని పూర్తి స్థాయిలో పంపిణీ చేశారు.

100 నుంచి 175 ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్...

ఇల్లెందు మండలంలోని 29 గ్రామపంచాయతీల పరిధిలో 19వేల కుటుంబాలు, మున్సిపాలిటీలోని 24 వార్డులలో 9వేల కుటుంబాలు ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా సేకరించిన వివరాలతో అధికారులు నిర్ణయించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం మండలంలో 139 మందిని, మున్సిపాలిటీ పరిధిలో 81 మందిని మొత్తంగా 220 మందిని ఎన్యూమరేటర్లుగా ఎంపిక చేశారు. వీరు చేపట్టే సర్వేను పరిశీలించేందుకు పర్యవేక్షకులుగా ప్రతీ పది మంది ఎన్యూమరేటర్లకు ఒకరు చొప్పున 22 మంది పర్యవేక్షకులను నియమించారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 100 నుంచి 175 ఇళ్లను సర్వే చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఉపాధ్యాయులు ఉదయం పాఠశాలకు హాజరై మధ్యాహ్నం నుంచి సర్వేకు హాజరు కావాల్సి ఉంటుంది. దీంతో ప్రతీరోజు పది ఇళ్లకు తగ్గకుండా సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

సర్వేకు ఎవరొస్తారంటే..

సర్వేకు ప్రక్రియను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయించడంతో సర్వే బృందంలో మార్పులు చోటుచేసుకున్నాయి. పల్లెల్లో టీచర్లతోపాటు పంచాయతీ కార్యదర్శులు కూడా ఎన్యూమరేటర్లుగా ఎంపికవగా.. మున్సిపాలిటీలలో సిబ్బంది కొరత కారణంగా టీచర్లతోపాటు అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సెర్ప్, మెప్మా సిబ్బందిలో కొందరికి ఎన్యూమరేటర్లుగా బాధ్యతలు అప్పగించారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపాలిటీలో కమిషనర్ సూపర్‌వైజర్లుగా, ప్రత్యేకాధికారులు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు.

ఇలా చేస్తారు..

ప్రభుత్వం ప్రకటించిన విధంగా బుధవారం నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం కానుంది. కానీ తొలి మూడు రోజులు అంటే 6, 7, 8 తేదీలలో ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌లలో పర్యటించి ఇళ్లు, కుటుంబాలను గుర్తించే ప్రక్రియను చేపడుతారు. ఇందులో భాగంగా ఓ ఇంటికి వెళ్లిన ఎన్యూమరేటర్ ఆ ఇంట్లో ఉన్న కుటుంబాల సంఖ్యను గుర్తిస్తారు. ఆ ఇంట్లో ఒకటి కంటే ఎక్కువ కుటుంబాలు ఉంటే అదే ఇంటి నంబర్‌ను కేటాయించి కుటుంబాల సమాచారం వేర్వేరుగా సేకరిస్తారు.

అంతేకాకుండా సర్వే నిర్వహించే రోజున సర్వే ఫాం సజావుగా నింపేందుకు ఇంటి యజమాని తన వద్ద సిద్ధంగా ఉంచుకోవాల్సిన సమాచారంపై ఎన్యూమరేటర్లు ఆయా కుటుంబాల పెద్దలకు ముందస్తుగా అవగాహన కల్పించనున్నారు. ఇలా మూడు రోజులపాటు ఇళ్లు, కుటుంబాల గుర్తింపు పూర్తి చేసుకొని 9వ తేదీ నుంచి సమగ్ర సర్వేకు శ్రీకారం చుడతారు. ఈ క్రమంలో ప్రభుత్వం నిర్దేశించిన 75 ప్రశ్నలతో కూడిన ఎనిమిది పేజీల సర్వే పత్రాన్ని ఇంటి యజమానులు ఇచ్చిన సమాచారం మేరకు పూరించనున్నారు.

అందుబాటులో ఉండాల్సిన సమాచారం..

సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లు సర్వేఫాంలో ఉన్న సమాచారాన్ని సేకరిస్తారు. దీనికోసం ఇంటి యజమాని కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, భూమి కలిగి ఉంటే ధరణి పట్టా ఖాతా నంబర్, భూమి సర్వే నంబర్, భూవిస్తీర్ణం, చదువులకు సంబంధించి ధృవపత్రాలు, బ్యాంకు పాస్‌పుస్తకం, వాహనాలు తదితర పలు అంశాలతో సిద్ధంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రజలు సహకరించాలి..



సమగ్ర ఇంటింటి కుటంబ సర్వే ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రజలందరూ సహకరించాలి. సర్వేకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆరో తేదీ నుంచి ప్రారంభమయ్యే సర్వేలో తొలి మూడు రోజులు కుటుంబాల గుర్తింపు ప్రక్రియ, 9వ తేదీ నుంచి నిర్దేశిత ఫారంలో వివరాల సేకరణ కొనసాగుతుంది.

– కోట రవికుమార్, తహసీల్దార్, ఇల్లెందు

సింగరేణి విద్యార్థినుల జయకేతనం



విజేతలతో అధికారులు, అధ్యాపక బృందం

సూపర్‌బజార్(కొత్తగూడెం): కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్‌లో సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు వివిధ విభాగాలలో అత్యున్నత ప్రతిభ కనబరిచి విజయ దుందుభి మోగించారు.

విజేతల వివరాలు..

- ఎం.ఇందు, బీకాం (సీఏ), 1500 మీటర్ల పరుగు పందెం, 800 మీటర్ల పరుగుపందెంలో స్వర్ణపతకం. 400 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్‌లో బంగారు పతకాలు.
- ఎ.వందన, బీకాం ద్వితీయ (సీఏ) డిస్కస్ త్రో, షాట్‌పుట్‌లలో బంగారు పతకాలు
- జి.రేణుక, ఎంపీసీఎస్ హ్యామర్ త్రోలో బంగారు పతకం
- ఎం.సంగీత, బీజెడ్‌సీ, 10,000 మీటర్లు, 5000 మీటర్లు పరుగులో 4వ స్థానం
- 4 ఇంటూ 100 మీటర్లు రిలేలలో ఎం.సింధు, సింధు, ఎ.వందన, ఎం.సంగీత స్వర్ణపతకం

మహిళా విభాగంలో 48 పాయింట్లతో ట్రోఫీని సాధించి, ఓవరాల్ చాంపియన్‌షిప్‌ని కైవసం చేసుకున్నారు. విజేతలను మంగళవారం సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్, కరస్పాండెంట్ కె.సునీల్‌కుమార్ విజేతలను అభినందించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ శారద, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.సావిత్రి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి



జూలూరుపాడు హైస్కూల్‌లో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: త్వరలో జరగనున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎన్నికల్లో అర్హత గల ఉపాధ్యాయులందరూ తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఏపీయూఎస్, టీపీయూఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు టి.సాయిరెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ డి.మురళీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు జూలూరుపాడు, సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి, ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. 2019 నాటి ఓటర్ల జాబితా పూర్తిగా రద్దయినందున ప్రతీఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఓటు నమోదుకు బుధవారంతో గడువు ముగియనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం విద్యారంగ, ఉపాధ్యాయ, అధ్యాపకుల, ఆచార్యుల సమస్యలు పరిష్కరించబడాలంటే విద్యారంగ అభివృద్ధి, జాతీయవాదులకు అండగా నిలిచే వారిని కౌన్సిల్‌కు పంపాలని కోరారు. టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు డి.సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, శివరామకృష్ణ, పాండురంగాచారి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు



ఇల్లెందురూరల్: పూజ చేస్తున్న భక్తులు

నాగుల చవితి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే మహిళలు పెద్ద ఎత్తున సమీపంలోని పుట్టల వద్దకు చేరుకొని పసుపు, కుంకుమలతో పూజించి, పాలు పోసి, నాగదేవతను చల్లంగ చూడాలని వేడుకున్నారు. బెల్లం, తాటిగుజ్జు, పాలు, గుడ్లు, అరటిపండ్లు నాగదేవతకు నైవేద్యంగా సమర్పించారు. పుట్టల వద్ద చిన్నారులకు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా సుబ్రహ్మణ్యస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



సుజాతనగర్‌లో పుట్టకు పాలు పోసి మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు



టేకులపల్లిలో....



సింగరేణి(కొత్తగూడెం): రామవరంలోని లక్ష్మీగణపతి ఆలయంలో..



పాల్వంచ: పుట్ట వద్ద పాలు పోస్తున్న భక్తులు